భారీ చెట్టు నరికివేత

విశాలాంధ్ర - సాగర్‌నగర్: ఏళ్ళ తరుబడి ఎందరికో నీడనిచ్చిన ఓ భారీ చెట్టును ఓ వ్యక్తి నరికివేశాడు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దుర్గానగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఓ వ్యక్తి బుధవారం మోడీ పర్యటన బిజీలో అధికారులు ఉంటారని భావించి భారీ బిల్డింగ్ నిర్మాణం చేపట్టాడు. తన నిర్మాణానికి అడ్డు వస్తున్న నెపంతో ఎటువంటి అనుమతులు లేకుండా ఆ భారీ వృక్షాన్ని బుధవారం అర్ధరాత్రి నరికి వేశాడు. గురువారం ఉదయం చూసేప్పటికి వృక్షం కాస్త మోడుగా మిగలడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తన నిర్మాణానికి అడ్డు వస్తున్న నెపంతో రోడ్డును ఆనుకుని ఉన్న వృక్షాన్ని ఎలా నరికివేస్తారంటూ స్థానికులు ప్రశ్నించారు. సంబంధిత అధికారులు ఇలాంటి సంఘటనలపై చర్యలు తీసుకోకుంటే నిర్మాణాల పేరుతో పచ్చదనం కనుమరుగవుతుందని అంటున్నారు.

హెచ్‌ఎంపీవీపై అలెర్ట్...

విమ్స్ ఆస్పత్రిలో 20 పడకల వార్డు ఏర్పాటు
మందులు, ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధం చేసిన అధికారులు
ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్న వైద్యులు



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) కేసులు దేశంలో నమోదు కావడంతో కోవిడ్‌లో వేలాది మందికి వైద్యం అందించిన విమ్స్ ఆస్పత్రి అలెర్ట్ అయింది. వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించడం కోసం ముందుస్తు చర్యగా విమ్స్ ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే.రాంబాబు ఆదేశాల మేరకు సిద్ధం చేశారు. ఆస్పత్రిలో కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన హై ఫ్లోన్యాసల్ కాన్యులా (నిమషంలో 60 లీటర్ల ఆక్సిజన్ అందించే) వాటిని కూడా సిద్ధం చేశారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. ప్రజలు ఈ వైరస్‌పై వస్తున్న వదంతులు నమ్మవద్దని, ఇది ప్రాణాంతకం కాదని, సాధారణ ఫ్లూ వైరస్ లక్షణాలే కనిపిస్తాయని తెలియజేసింది. వైరస్ లక్షణాలు జ్వరం, గొంతునొప్పి, ముక్క దిబ్బడ, ఆయాసం వంటివి వైరస్ లక్షణాలు. వైరస్ సోకిన వారికి రిబావిరిన్, అజిత్రో మైసిన్ లాంటి మందులతో చికిత్స అందిస్తారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు.

వైరస్ లక్షణాలు:

జ్వరం, గొంతునొప్పి, ముక్క దిబ్బడ, ఆయాసం వంటివి వైరస్ లక్షణాలు. వైరస్ సోకిన వారికి రిబావిరిన్, అజిత్రో మైసిన్ లాంటి మందులతో చికిత్స అందిస్తారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉంది. హైరిస్క్ గ్రూపులకు చెందిన హెచ్ఐవీ, క్షయ, డయాలసిస్ రోగులు, సీఓపీడీ, ఆస్తమా రోగులు హెచ్‌ఎంపీవీ వైరస్ బారిన పడే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

చేతులు పరిశుభ్రత పాటించాలి.

మాస్కులు ధరించాలి.

బహిరంగ ప్రదేశాల్లో తుమ్మడం, దగ్గడం చేయ కూడదు.

వైరస్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

సాధారణ జలుబు లాగే..

హెచ్‌ఎంపీవీ కామన్ కోల్డ్ లాంటిది. భయ పడాల్సిన అవసరం లేదు. ముందుస్తు చర్యల్లో భాగంగా విమ్స్ ఆస్పత్రిలో 20 పడకల వార్డును, మందులను సిద్ధం చేశాం. కోవిడ్‌కు తీసుకున్నట్టు గానే ఈ వైరస్ నివారణకు కూడా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. పిల్లలు, వృద్ధులు, హైరిస్క్ గ్రూపు వారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.

- విమ్స్ డైరెక్టర్ డా. కె.రాంబాబు

రాష్ట్ర ప్రజలను వంచించిన మోదీ

ఉక్కు విషయమై ప్రకటన చేయకపోవడంపై సీపీఐ, సీపీఎం ఆగ్రహం

విశాలాంధ్ర - విశాఖ: ప్రధాని మోదీ సహా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు స్టీల్ ప్లాంట్ విషయం ప్రస్తావించకపోవడం రాష్ట్ర ప్రజలను వంచించడమేనని వామపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విశాఖలో మోదీ పర్యటన మొత్తం నమ్మక ద్రోహంతో సాగిందని వామపక్ష పార్టీల నాయకులు మండిపడ్డారు. మోదీ, బాబు, పవన్‌ల ద్రోహన్ని నిరసిస్తూ గురువారం నగరంలోని జగదాంబ కూడలి నుండి వాచ్ హౌస్ జంక్షన్ వరకు నిరసన నిర్వహించి అనంతరం జగదాంబ కూడలిలో వామపక్షపార్టీల కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.గంగారావులు మాట్లాడుతూ మోదీ ఏపీ ప్రజలను వరుసగా మోసం చేస్తూ ఉన్నా బాధ్యత లేకుండా చంద్రబాబు ప్రభుత్వం చోద్యం చూస్తూ మిన్నకుంటున్నదని విమర్శలు గుప్పించారు. మోసపురిత మోదీ పర్యటన పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని ధ్వజమెత్తారు. విశాఖ నగరంలో సభ పెట్టి స్టీల్ పరిరక్షణ గురించి నోరు మెదపని ముగ్గురు నేతలను ప్రజలు గమనిస్తూ ఉన్నారని పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వంతో అంటకాగుతూ కూడా రాష్ట్ర ప్రయోజనం కోసం నోరు మెదపని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు చరిత్రహీనులుగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఉక్కు రక్షణ సహా కీలకమైన పోలవరం, ప్రత్యేక హోదా తదితర అంశాలపై ఎవ్వరికీ బాధ్యత లేకుండా పోయిందని మండిపడ్డారు. ఇటీవల ఎన్నిక మేనిఫెస్టోలో టీడీపీ, బీజేపీ, జనసేన లు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామని చెప్పి ఇపుడు మోదీ ముందు మాట్లాడలేకపోవడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మోదీ, చంద్రబాబు, పవన్ క్షమాపణ చెప్పాలని, రాష్ట్ర ప్రయోజనాలకు కట్టుబడి పని చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం జిల్లా నాయకులు జగన్, జీఎస్‌జె అచ్యుతరావు, పద్మ, ఎండి బేగం, కృష్ణారావు, ఎస్‌కె రెహమాన్, సిఎస్ క్షేత్రపాల్, బి.ఈశ్వరమ్మ, వనజాక్షి, దేముడమ్మ, జి.జయ, ఎం.మన్మధరావు, జి.రాంబాబు, బి.పుష్పలత, వై.రాంబాబు, యు.నాగరాజు, ఎస్.అప్పన్న, సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు నాయకుడు దేవా తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలలో "సే నో టు ప్లాస్టిక్" స్టిక్కర్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖను ప్లాస్టిక్ ఫ్రీ సిటిగా తీర్చిదిద్దడమే ప్రధమ లక్ష్యమని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన జీవీఎంసీ జోన్-3, వార్డు-27లో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగానున్న సాయి కృష్ణ పార్లర్ దుకాణంలో "సే నో టు ప్లాస్టిక్" స్టిక్కర్‌ను వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు, జీవీఎంసీ అధికారులతో కలిసి అతికించి అందరికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారిని ఈ నగరం నుండి తరిమి వేయడమే ప్రధమ కర్తవ్యంగా విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను జనవరి 1వ తేది నుండి నిషేధించడమైనదని, ఆ దిశగా ప్రజలకు, వినియోగదారులకు, ఉత్పత్తి, అమ్మకం, సరఫరాదారులకు అవగాహనపరుస్తూ, అతిక్ర మించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతు న్నామన్నారు. విశాఖ నగరంలో వ్యాపార లైసెన్సులు కలిగిన 50 వేల దుఖాణాలలో, వాణిజ్య సముదాయాలలో "సే నో టు ప్లాస్టిక్" అనే స్టిక్క ర్లను గురువారం 598 సచివాలయాల పరిధిలో గల అందరు వార్డు కార్యదర్శులు, శానిటరీ ఇన్ స్పెక్టర్లు, ఆర్పీలు, ఎస్.హెచ్.జి మహిళల ద్వారా సమూహంగా దుఖాణాలలో ఒకేసారి అతికించే కార్యక్రమం చేపట్టడమైనదన్నారు. ఈ సందర్భంగా సాయి క్రిష్ణ పార్లర్ నందు సే నో టు ప్లాస్టిక్ స్టిక్కర్‌ను అతికించిన అనంతరం కమీషనరు జూమ్ యాప్ ద్వారా వార్డు కార్యదర్శులతో మాట్లాడుతూ గురువారం నుండి సంక్రాంతి లోగా అన్ని దుకాణాలలో ఈ స్టిక్కర్లను అతికించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని కొనుగోలుదారులకు దుకాణాల యజమానులు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం "ఐ సపోర్టు ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్", "సే నో టు ప్లాస్టిక్" అనే నినాదంతో ఏర్పాటు చేసిన ర్యాలీలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమ న్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జివిఎంసి యుసిడి విభాగం సిబ్బంది తదితరులుతో కలసి పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 3వ జోనల్ కమీషనరు కె.శివప్రసాద్, ఎ.ఎమ్.ఒ.హెచ్. బి.ప్రసాదరావు, ఎపిడి రాము, ఆర్పీలు, ఎస్.హెచ్.జి మహిళలు, జూమ్ యాప్ నందు అన్ని సచివాలయాల పరిధిలో గల, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం (వైకుంఠ ఏకాదశి) ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. నేడు భక్తులు స్వామివారిని వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లన్నీ పూర్తి అయినట్లు, దేవాదాయ శాఖ, పోలీస్ అధికారులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలని అధికారులు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేశారు. గురువారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సహాయ కార్యనిర్వహణా ధికారి ఆనంద్ కుమార్, సూపరిండెంట్ సునీల్, ఏఈ బాబ్జి గోపాలపట్నం ఎస్.హెచ్. ఓ అప్పారావు, ఎస్ఐ అప్పలనాయుడు క్యూలైన్లు పరిశీలించారు.

తిరుపతి తొక్కిసలాటలో నలుగురు విశాఖవాసులు మృతి

శాంతి (34)గా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: తిరుమలలో తొక్కిసలాటలో మృతి చెందిన వారు ఉమ్మడి విశాఖ జిల్లా వాసులే నలుగురు కావడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఒకరు అనకాపల్లి జిల్లా వాసి కాగా, మరో ముగ్గురు విశాఖ నగరానికి చెందిన వారే కావడంతో ఆ కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాద ఛాయలు అల్యుకున్నాయి. తిరుమలలో తొక్కిసలాటలో 40 మంది గాయపడ్డారు. 28 మందిని రుయా ఆసుపత్రికి తరలించారు. 12 మందిని సిమ్స్ ఆస్పత్రికి తరలించారు. రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 28 మందిలో నలుగురు మృతి చెందగా, సిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 12 మందిలో ఇద్దరు మృతి మృతి చెందారు. మొత్తం ఆరుగురిలో ఐదు మంది మహిళలు ఉండగా , ఒకరు మాత్రమే పురుషుడు ఉన్నారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో విశాఖకు చెందిన ముగ్గురు మహిళలు మృతి చెందారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పెదబొడ్డేపల్లికి చెందిన బి.నాయుడుబాబు (51), విశాఖ మద్దిలపాలెం రజిని (47), తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్య స్వాతి (40), కంచరపాలెంకు చెందిన శాంతి (34)గా గుర్తించారు. బి.నాయుడుబాబు బోర్‌వెల్స్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య మణికుమారి చెట్టుపల్లి గ్రామానికి చెందిన స్నేహితుడి దంపతులతో కలిసి తిరుపతి వెళ్లారు. తొక్కిసలాటలో నాయుడుబాబు మృతి చెందినట్టు మృతుని భార్య మణికుమారి ఫోన్ ద్వారా బంధువులకు తెలిపింది. అలాగే మృతురాలు శాంతి భర్త ఆటో డ్రైవర్ వెంకటేష్, ఒక కుమారుడు ఉన్నారు.

అభివృద్ధి త్రిమూర్తులను చూసి ప్రజలు పులకించారు

- జనసేన నేత మూర్తి యాదవ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అభివృద్ధి త్రిమూర్తులు ...ప్రధాని మోదీ, విజనున్న చంద్రబాబు, పవర్ ఫుల్ లీడర్ పవన్ కళ్యాణ్‌ను ఒకే వేదిక మీద ఒకేసారి చూసిన ఉత్తరాంధ్ర ప్రజలు పులకించి సంక్రాంతి ముందే వచ్చిందని సంబరపడ్డారని జనసేన నేత, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. గురువారం పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరదాలు మాటున జగన్ వెళ్లేవాడని, ప్రజల మధ్యలో నుంచి ప్రధాని, సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వెళ్లిన తీరు ప్రజలు మర్చిపోలేరన్నారని బుధవారం ప్రధాని పర్యటన గూర్చి వ్యాఖ్యానించారు. ఒకేరోజున రూ.2,08,548 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు ఒక రికార్డ్ అని పేర్కొన్నారు. ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్, రైల్వే జోన్, కృష్ణపట్నం పారిశ్రామిక పార్కు శంకుస్థాపన వంటి అభివృద్ధి పనులు రాష్ట్ర అభివృద్ధికి భవిష్యత్తులో దోహదపడతాయి అన్నారు. రాష్ట్రంలోని అభివృద్ధి చేసిన పలు రోడ్ల ప్రారంభంతో రాష్ట్ర ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తపరుస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కటొక్కటిగా అమలు చేస్తూ వస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రి అమర్నాథ్ లేదన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు, బల్క్ డ్రగ్ ప్రాజెక్టు, రైల్వే జోన్ వైసీపీ హయాంలోనే తెచ్చామని చెప్పుకుంటున్న అమర్నాథ్ ఆనాడు ఎందుకు ప్రధానమంత్రిని తెచ్చి ప్రారంభోత్సవం చేయించలేదని ప్రశ్నించారు. కనీసం తన సొంత నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పాలన్నారు. ఐదేళ్లలో ఉత్తరాంధ్రలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చర్చకి సిద్ధమా అమర్ అని సవాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 1650 కోట్ల రూపాయలను స్టీల్ ప్లాంట్‌కు మంజూరు చేసి ఆదుకుందని గుర్తు చేశారు. మా అధినాయకుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మారుమూల గిరిజన ప్రాంతాలలో పర్యటించి యుద్ధ ప్రాతిపదికన అక్కడ రోడ్లను వేయిస్తున్నారన్నారు.

తిరుపతి ఘటనలో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - పెందుర్తి: వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుపతి వచ్చి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు న్యాయం చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకి భారీ పరిహారం చెల్లించి ఆదుకోవాలని, అలాగే ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కన్నా ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని షఫీ ప్రభుత్వాన్ని కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు కుమారుడు చిరంజీవి బోని తేజ మూడవ వర్ధంతి సందర్భంగా వైసీపీ నాయకులు దాట్ల పెదబాబు చేతుల మీదుగా పేదలకు 200 దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేశారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు నివాళు లు అర్పించారు.

కూటమి ప్రభుత్వానిది నమ్మకద్రోహం

విశాలాంధ్ర - మధురవాడ: ఎన్నికల ముందు ఓట్లు దండుకోవడానికి ఒక మాట, గెలిచిన తరువాత మరో మాట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి తెలిసినంతగా మరెవ్వరికి తెలియదనేది మరోసారి రుజువైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి.అప్పలరాజు పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ మధురవాడ మార్కెట్ కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ సభలో, చంద్రబాబు నాయుడు మన విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించమని అడగకుండా ఒక ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ అయిన మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించమని అడగడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. విశాఖలో ప్రధాని నరేంద్ర మోడీ సభలో చంద్ర బాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు ప్రధానిమోడీతో విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయడం లేదని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని ప్రకటన చేయించలేక పోయారని విమర్శించారు. గతంలో స్టీల్ ప్లాంట్ బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం నేను సిద్ధం మీరు సిద్ధమా అని అడిగారని గుర్తు చేసారు. అనంతరం ప్లేకార్డులు ప్రదర్శిస్తూ నగరంపాలెం రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించి, రహదారిపై కొంతసేపు రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజు కుమార్, సీపీఎం, సిటు కార్యకర్తలు ఏ.గురుమూర్తి రెడ్డి, డి.రవి, ఎస్.రామప్పుడు, వి.గోవింద, బి.రాంబాబు, గోపి, ఎన్.బంగార్రాజు, కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాల రాజకీయ చైతన్య సమావేశం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ మండెం సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన ఉత్త రాంధ్ర వెనుకబడిన కులాల నాయకుల సామాజిక రాజకీయ చైతన్య సమావేశం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్‌రావు సూచనలతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండెం సుభాష్ చంద్ర బోస్‌ని గ్రేటర్ విశాఖపట్నం నగర బీసీ సంక్షేమ సంఘం అధ్య క్షునిగా రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు నియమించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కామన సుబ్బారావు, పల్లా రమణ గారు, గొర్ల శ్రీనివాస్ నాయుడు, బీసీ స్టడీ సర్కిల్ యిళ్ళ వెంకటేశ్వరరావు, ఒడిశల రాజువ్ గౌడ్‌ల ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించ బడినది. ఉత్తరాంధ్ర కు చెందిన మత్స్యకార, యాదవ, గౌడ శెట్టి బలిజ, వెలమ, తూర్పు కాపు, కాళింగ, సిస్టికరణం, నగర, నాయిబ్రాహ్మణా, రజక, షరాబు, గవర, నాగవంశం బీసీ కులాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రంలో బీసీ కులాలకు చెందిన వారిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ గా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించడం ద్వారా బీసీ కులస్తులకు సామాజిక గౌరవాన్ని పెంపొందిం చిందని కేసిన శంకర్‌రావు అభిప్రాయపడ్డారు. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్‌పై కూటమి ప్రభుత్వం 33 శాతం కల్పిస్తూ చేసిన తీర్మానం రాష్ట్ర బీసీల ఉన్నతికి చిరస్థాయి గొప్ప వరం లాంటిదని భావించబడిం దన్నారు. బీసీ కులస్తుల సామాజిక భద్రతకు వెన్నెముక లాంటి బీసీ రక్షణ చట్టాన్ని తక్షణమే చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని బీసీలందరూ ఉన్నత స్థితి వైపు నడిపించబడగలరని ఈ సమావేశంలో పాల్గొన్న పెద్దలందరూ ఏకాభిప్రాయం తెలియచేసారు.

గత ప్రభుత్వం ఈ-దర్శన్ కేంద్రాలను మూసేసింది అందువల్లే తిరుపతి ఘటన

వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: తిరుపతి సంఘటన దురదృష్టకరమని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వం బాధితుల కుటుంబాలకు అండగా ఉంటుందని తెలిపారు. సాధారణ భక్తులకు టీటీడీ దర్శనం టికెట్స్ జారీకి ఉన్న ఈ-దర్శన్ కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వంలో మూసివేశారని, ఈ-దర్శన్ కేంద్రాలు ఉంటే ఈ సంఘటన జరిగేది కాదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాజకీయం చేయటం సరికాదని, వాస్తవానికి టీటీడీని భ్రష్టు పట్టించిన ఘనత వైసీపీకే దక్కుతుందని విమర్శించారు. ప్రస్తుతం టీటీడీని ప్రక్షాళన చేసే పనిలో కూటమి ప్రభుత్వం ఉందని, సంఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు స్పందించి తక్షణ సహాయక చర్యలు ప్రారంభించారని, పలువురు మంత్రులు హుటాహుటిన తిరుపతి వెళ్లేలా తగిన ఆదేశాలు జారీ చేశారన్నారు. మున్ముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు శవ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. అక్కడ వాస్తవ పరిస్థితిని చూడకుండానే నానా యాగి చేయటం సబబు కాదన్నారు. ఇదివరలో ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు పరదాలు కట్టుకొని రాజప్రసాదంలో దాక్కున్న వాళ్ళా మాట్లాడేదని ప్రశ్నించారు.

గీతం విద్యార్థుల "సంక్రాంతి" సంబరాలు

విశాలాంధ్ర - మధురవాడ: తెలుగు వారి అతి పెద్ద పండుగలలో ఒకటైన సంక్రాంతి రాక సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ముందస్తు పండుగ సంబరాలు గురువారం అట్టహసంగా ప్రారంభమయ్యాయి. తెలుగు దనం ఉట్టి పడేలా సంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థులు విశ్వవిద్యాలయ ఆవరణలో సందడి చేశారు. ఎప్పుడూ జీన్స్ ఫ్యాంట్ వంటి ఆధునిక వస్త్ర ధారణతో కేంపస్‌లో తిరుగాడే విద్యార్థులు ఒక్కసారిగా పంచెలు, చీరలు, ఓణీలతో తరగ తులకు హాజరుకావడంతో పాటు గీతం ప్రాంగణం లోని రహదారులపై రంగ వల్లులను తీర్చి దిద్దుతూ సంక్రాంతి శోభను ముందుగానే తీసుకువచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజిలకు చెందిన విద్యార్థులు రంగోలీ పోటీ, సంప్రదాయ వేషధారణ పోటీలలో సంక్రాంతి సంబరాలకు ఉత్సాహాన్ని నింపారు. బోధన, బోధనేతర సబ్బంది సహితం విద్యార్థులతో కలసి సంక్రాంతి వేడుకలలో పాల్గొన్నారు. గీతంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చి విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు తెలుగు వారి సంప్రదా యాలను తెలియజెప్పడానికి ఈ వేడుకలు ఉపయో గపడతాయని గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అన్నారు. విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలతో గీతం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

భీమిలి డైట్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - భీమిలి: జిల్లా విద్యా శిక్షణ సంస్థ భీమునిపట్నంలో ఛాత్రోపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. సంప్ర దాయ సంక్రాంతి పల్లె కళను డైట్‌లోకి తీసుకు వచ్చి గంగిరెద్దులు వేషం, రంగవల్లులు, సోదిమ్మ కథలు, చిలక జోస్యం, డప్పులోళ్ళ సంబరం మొదలగు పండగ అంశాలన్నీ ప్రదర్శించి పండగ శోభను డైట్లో కనువిందుగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ పండుగలను, వాటి చారిత్రక విశేషాలను నేటి తరానికి, భవిష్యత్ తరానికి అందించవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కాబట్టి ఛాత్రోపాధ్యాయులు ఈ అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవడానికి నిర్వహించిన కార్యక్రమాలు ప్రశంసదాయకంగా ఉన్నాయని అన్నారు. జరిగిన ఈ వేడుకల్లో సీనియర్ అధ్యాపకులు ఎల్.సుధాకర్, జి.జి.ఎస్. నాగేశ్వరరావు, అధ్యాపకులు మాధవి, మహాలక్ష్మి, త్రినాధరావు, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే కల్లు గీత కార్మికుల అభివృద్ధి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆంధ్రప్రదేశ్ యాత సంక్షేమ సేవ సంఘం భీమిలి నియోజకవర్గం కల్లుగీత సహకార సంఘాల సమావేశం గురువారం నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంధ్రప్రదేశ్ యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గీత ఉప కులాల కన్వీనర్ అంగటి రాము హాజరయ్యారు. గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో కళ్ళు గీత కార్మికులకు ఎంతో అన్యాయం జరిగిందని కళ్ళు గీత కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రం మొత్తంగా 336 షాపులో మా కల్లు గీత కార్మికులకు కేటాయించడంలో కృషి చేసిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లోకేష్, బిజెపి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికలలో ఏకీగ్రీవంగా కాపులప్పాడ నీటి చానల్లో గండిబోయిన రమణ డైరెక్టర్‌గా ఎన్నుకోవడం జరిగిందన్నారు. గుడిలోవ నీటి ఛానల్‌లో గొలుసు శీను డైరెక్టర్‌గా ఎన్నుకున్నట్టు తెలిపారు. వీరిద్దరితోపాటు శ్రీశైలం రాష్ట్ర నాయకులు హరి ప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు చిట్టి బోయిన రాము, రీసు రమణ, గండి బోయిన రమణ, కాకర ఎల్లారావు, హరి ప్రసాద్, కొలుసు శ్రీను, గండిబోయిన సత్యం కల్లు గీత సహకార సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సంక్రాంతి పండగ సందర్భంగా ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడపనున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు రెగ్యులర్ బస్సులతోపాటు స్పెషల్ బస్సులు కూడా 13వ తేదీ వరకు ప్రతిరోజు బస్సులు నడపనున్నట్టు తెలిపారు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు 20 బస్సులు, విశాఖ నుంచి రాజమండ్రి, విజయవాడకు 40 బస్సులు, విశాఖ నుంచి కాకినాడకు 20 బస్సులు, విశాఖ నుండి విజయనగరం, పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురంలకు 830 బస్సులు నడపనున్నట్టు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం అంబరాన్నంటాయి. రంగురంగుల రంగవల్లికల మధ్య గొబ్బెమ్మలు పెట్టి విద్యార్థులు నృత్యాలు చేశారు. భోగిమంటలు వేసి తిలకించారు. ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులకు భోగిపళ్ళు వేశారు. బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. కుండలో పాలు పొంగించి పరమాన్నం వండి తెలుగు సాంప్రదాయాన్ని చాటి చెప్పారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆకృతులు గ్రామీణ నేపథ్యాన్ని తలపించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.తారకేశ్వర రావు మాట్లాడుతూ సంక్రాంతి రైతుల పండగని, వా6పండించిన పంట చేతికి అందించే రోజని చెప్పారు. రైతు దేశానికి వెన్నుముక లాంటి వారని, రైతు సంక్షేమాన్ని మనమందరం ఆకాంక్షించాలని అన్నారు. భోగి పళ్ళు పోయడం వల్ల సూర్య భగవానుని అనుగ్రహం కలుగుతుందని వివరిం చారు. సూర్యుడు ఉత్తరాయణం లోకి రాబోతున్న రోజుని మకర సంక్రాంతి అంటారని తెలియ జేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతులు, డూడూ బసవన్న హరిదాసు వేషాధారణలలో అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకు న్నాయి. సంక్రాంతి

పండుగ సందర్భంగా ఉత్తరాంధ్ర పాఠశాల ఏ. జి.యం యం.వి సురేష్, రీజనల్ ఇన్‌చార్జ్ మహమ్మద్ అలీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ యస్.వి.గోవిందరావు, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ యం.ఆర్.వి.శేషగిరి, అసిస్టెంట్ డీన్ హప్ సా, ప్రైమరీ ఇన్‌చార్జ్ వి.ధనలక్ష్మి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ టి.శోభ, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: సుజాతనగర్ రవీంద్రభారతి పాఠశాలలో సంక్రాంతి వేడుకలు గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు. రవీంద్రభారతి ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జ్ ఎన్.వెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప, సీ.జీ.యం జీ.ఆర్. వసంత మాట్లాడుతూ సంక్రాంతి అనగా నూతన క్రాంతి అని సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అం టారని పేర్కొన్నారు. సూర్యుడి చుట్టూ భూమి పరిభ్రమించే మార్పు క్రమంలో తన చుట్టూ తాను కూడా తిరుగుతుందని, అందువలన సూర్యుడు ఆరు నెలలు ఉత్తరం వైపు ఆరు నెలలు దక్షిణం వైపు కనిపిస్తాడని, ఇలా ఉత్తరం వైపు కనిపించే క్రమమే ఉత్తరాయణం అంటారని, దక్షిణం వైపు కనిపించే క్రమం దక్షిణాయణమని తెలిపారు. ఉత్తరాయణమనేది ఎంతో పవిత్రమై నదని భీష్ముడు ఎదురుచూసి ఉత్తరాయణ పుణ్య ఘడియలలోనే పరమ పదించారని చెప్పారు. సంక్రాంతిని మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారని, మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవ రోజు కనుమ. కొన్ని ప్రాంతా లలో నాలగవ రోజు ముక్కనుమగా జరుపుకుంటారని వెల్లడించారు.

ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతిగా భక్తకోటి పూజలు అందుకుంటున్న పెందుర్తి వెంకటాద్రిపై ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామానుజాచార్యులు, ఆలయ కార్య నిర్వహణ అధికారిని నీలిమ తెలియజేశారు. శుక్రవారం తెల్లవారుజామున 4:30 గంటల నుండి భక్తులకు స్వామి వారు ఉత్తర ద్వారం నుండి దర్శనం ఇస్తారని తెలిపారు. విశాఖ నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారని అందుకు తగ్గట్లుగా ఏర్పాటు చేశామని వెల్లడించారు. మరోవైపు ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా 25 వ రోజు గురువారం శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవా కాలం, శాత్తుమరై, తిరుప్పావై పారాయణం ప్రవచనాలు వంటి వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకోగా, వారికి కొండ దిగువ నుండి ఆలయ వరకు బస్సు సౌకర్యం వంటి సేవలను సమకూర్చారు.

జనవరి 22న మొబైల్ ఏఐతో సామ్‌సంగ్ నూతన ఆవిష్కరణ

విశాలాంధ్ర- విశాఖపట్నం: మరింత సహజమైన ఆకర్షణీయమైన ఏఐ కోసం ప్రయత్నం చేసి గెలాక్సీ ఏఐ యొక్క తదుపరి పరిణామం రాబోతోందని సాంసంగ్ ప్రతినిధి చెప్పారు. మొబైల్ ఏఐ అనుభవాల కోసం మరోసారి విప్లవాత్మక ఆవిష్కరణలను తీసుకురావటానికి సాంసంగ్ కృషి చేస్తుందన్నారు. జనవరి 22న, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ శాన్ జోస్‌లో ఈ ఆవిష్కరణ కార్యక్రమంను నిర్వహిస్తుందని, తాము మొబైల్ ఏఐ లో కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తున్నట్టు చెప్పారు. ప్రీమియం గెలాక్సీ ఆవిష్కరణలు సౌకర్యవంతమైన అనుభవాన్ని అందిస్తాయని, ఈ కార్యక్రమం Samsung.com/in, సామ్‌సంగ్ న్యూస్‌రూమ్ ఇండియా, సామ్‌సంగ్ యూట్యూబ్ ఛానెల్‌లో భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30 నుండి ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుందన్నారు.

బివియన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 70వ వార్డు చట్టివానిపాలెంలో గల భాస్కర్ విద్యానికేతన్ స్కూల్‌లో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు 2025లో క్రమశిక్షణతో చదువులో బాగా రాణించాలని, తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బందికి అంతా మంచి జరగాలని కోరుకుంటూ అందరికీ నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్కూల్ పేరుతో వున్న నూతన సంవత్సర క్యాలెండర్‌ను తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ చేతులమీదుగా ఆవిష్కరించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు, పాఠశాల సిబ్బందికి వంచిపెట్టారు.

వైకుంఠ ఏకాదశికి పూర్తి ఏర్పాట్లు

- అల్లిపురం వెంకటేశ్వర స్వామి బాలయ్య పరిపాలనాధికారి రమాబాయి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అల్లిపురం వెంకటేశ్వర మెట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం నిర్వహించే వైకుంఠ ఏకాదశి వేడుకలు, ఉత్తర ద్వార దర్శనానికి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పరిపాలనాధికారి జి.వి.రమాబాయి తెలియజేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం తెల్లవారుఝామున ఒంటిగంట నుండి ఆరాధన, నివేదన, తిరుప్పావై సేవా కాలం, ధనుర్మాస అర్చనలు, నీరాజన మంత్రపుష్పం వల్లకి సేవ, ఉదయం 3 గంటలకు ఉత్తర ద్వార దర్శనం, శ్రీ స్వామివారి మండపంలో ప్రథమ అర్చన, సహస్రనామార్చన ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు తిరిగి సహస్రనామార్చన జరుగుతుందని పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి వేడుకలు ఉత్తర ద్వారదర్శనం సంబరాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శనివారం కూడారై ఉత్సవం, 12న గోదాదేవి, శ్రీ స్వామి వారిని కళ్యాణ దంపతులుగా అలంకరణ,13న భోగి పండుగ సందర్భంగా గోదాదేవి కళ్యాణం, 14న మకర సంక్రాంతి వేడుకలు, 15న కనుమ పండగ సందర్భంగా తిరువీధి మహోత్సవం,16న ముక్కనుమ సందర్భంగా పరస మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 93 వ వార్డు కార్పొరేటర్, టిడిపి సీనియర్ నేత రాపర్తి కన్నా, వార్డు అధ్యక్షులు గంగవరపాలు ఆధ్వర్యంలో ప్రహ్లాదపురం ఏరియాలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం ఉత్సాహంగా సాగింది. ఒక్క రోజులోనే 150 మంది స్థానికులు టిడిపి సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో 69వ వార్డ్ మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ .జిల్లా మహిళా కమిటీ సభ్యులు మంగతాయారు. 93వ తెలుగుదేశం మహిళా వార్డు అధ్యక్షురాలు తోకాడ అప్పల నరసమ్మ. చిన్ని. ఉప సర్పంచ్ జీ మహేష్. కర్రీ పైడిరాజు. పళ్ళ అప్పలరాజు. పల్లా రవి. దుఃఖ అప్పారావు. బలిరెడ్డి శ్రీను. మాధవ. నాగరాజు. దేశప్ప గాంధీ. వెంకట్. కళ్యాణ్. పురుషోత్తం. రాధా. ఏవి రావు. పట్నాల మోహనలక్ష్మి. తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి శ్రీనివాస్ నగర్ జంక్షన్ లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని కార్పొరేటర్ కన్నా తెలియజేశారు.

అనంతపద్మనాభ స్వామి ఆలయంలో నేడు పుష్పయాగం



విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో కొలువై ఉన్నటువంటి శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం పుష్పయాగం నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలియజేశారు. కుంతీ మాధవ స్వామి వారి దేవాలయంలో ధమర్మాసం పురస్కరించుకొని ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 3:30 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకం 7:30 గంటలకు స్వామివారి గ్రామ సేవ 8.15 నిలకు, ఉత్తర ద్వార దర్శనం తదుపరి తీర్థ ప్రసాద వితరణ /సాయంత్రం 5.30ని.ల.కు, సహస్ర దీపాలంకరణ సేవ తదుపరి 6.30. నిలకు స్వామివారికి 'పలు రకాలపుష్పములతో శ్రీ పుష్పయాగం జరుగుతుందన్నారు. కావున భక్తులందరూ ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని అనంత పద్మనాభ స్వామి కుంతీ మాధవ స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని అనువంశ ధర్మకర్త, స్వామివారి సేవలో దేవాలయం కావ్య నిర్వహణాధికారి ఈవో నానాజీ తెలిపారు.

124.50 కోట్ల పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 90వ వార్డ్ లోని కొండవాలు ప్రాంత మైన లక్ష్మీ నగర్ ఫ్ బ్లాక్ నందు ఎన్నో ఏళ్లుగా చిన్న చిన్న వర్షాలకు సైతం కొండ చర్యలు విరిగిపడి తరచుగా ఆస్తి నష్టం జరగడంతో సమస్యను స్థానిక నాయకులు, ప్రజలు 90వ వార్డ్ కార్పొరేటర్ బొమ్మిడి రమణ దృష్టికి తీసుకురాగా, ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు సూచన మేరకు లక్ష్మీ నగర్ ఎఫ్ బ్లాక్ లోని రక్షణ గోడ నిమిత్తం ఒక్క కోటి, ఇరవై నాలుగు లక్షల (124.50 కోట్లు) జీవీఎంసీ వార్డ్ అభివృద్ధి నదులు మంజూరు చేయించడమే కాకుండా, నేడు విజయ దుర్గ అమ్మవారి ఆలయ సమీపం నందు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ బాబీ, పబ్లిక్ వర్క్స్ ఏ.ఈ వెంకట లక్ష్మీ , వర్క్ ఇన్స్పెక్టర్లు రామ కృష్ణ, స్థానిక తెలుగుదేశం నాయకులు ఎం.వి.ఆర్. స్ శ్రీను పట్నాయక్, గాడు వెంకట లక్ష్మీ, కర్మిజ్జి జ్యోతి, పోతల సతీష్, దొడ్డి ధన లక్ష్మీ, గేదెల చిన్ని, మాధవి, కె. రామోజీ, కాకర్ల మర్యామ్మ, దోమరాజు, మహా లక్ష్మీ, కాకర సింహచలం తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి దుర్ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వైకుంఠ ఏకాదశి రోజు తిరుమల శ్రీవారి దర్శనం టోకెన్ల జారీకి ఏర్పాటు చేసిన క్యూలైన్లలో తీవ్ర తొక్కిసలాట, ఆరుగురి దుర్మరణానికి సీఎం, టీటీడీ ఉన్నతాధికారులు, కలెక్టర్, ఎస్పీదే బాధ్యత అని వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున, క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖలో ప్రధాని పర్యటన పేరుతో కూటమి నాయకులు రోజంతా హడావుడి చేయడం తప్ప, ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ప్రధానితో శంకుస్థాపన చేయించిన వాటిలో ఒక్క ప్రాజెక్టయినా చంద్రబాబు సాధించినది ఉందా అని ప్రశ్నించారు. చివరకు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంపై ప్రధానితో కనీసం ప్రకటన చేయించలేకపోయారని విమర్శించారు. మంచి జరిగితే మన ఖాతాలో, చెడు జరిగితే జగనే కారణం అన్నట్టుగా గత ఏడు నెలలుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. అధికార యంత్రాంగం అంతా ఏమైపోయారు..చరిత్రలో ఏనాడూ ఇలాంటి

ఘటనలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లడ్డూ విషయంలో ప్రాయశ్చిత్త దీక్షలు చేసిన సనాతనవాదులు ఇప్పుడేం చేస్తారో చూస్తాం అని పరోక్షంగా పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. తిరుపతిలో జరిగిన దుర్ఘటనకు చింతిస్తున్నానని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం అన్నారు.

ప్రధాని పర్యటనను జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు

- అమర్ నీ పంథా మార్చుకోకపోతే రాజకీయంగా కనుమరుగు

- టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రధాని పర్యటనను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని రాష్ట్ర కో-ఆపరేటివ్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆయన తిరుమలలో జరిగిన దుర్ఘటన పట్ల విచారం వ్యక్తపరుస్తూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. విశాఖ పర్యటనలు ప్రధాని మోదీ 2.8 లక్షల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభాలు చేయడం పట్ల రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టులతో యువతకు మూడు, నాలుగు లక్షలు ఉద్యోగాలు లభిస్తాయని తెలియజేశారు. నిన్న శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులకు గతంలోనే శంకుస్థాపన చేసామని వైసీపీ నాయకులు చెబుతున్నారు. గతంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ వచ్చి ఎలా శంకుస్థాపన చేస్తారని ప్రశ్నించారు. వైసీపీ నాయకులకు పరిపాలన చేతకాదని, గతంలో మంత్రిగా ఉన్న సమయంలో అమర్నాథ్ ఏం సాధించావో చెప్పాలి అని డిమాండ్ చేశారు. అమర్నాథ్ కు మైకు పట్టుకుంటే పూనకం వచ్చి ఏం మాట్లాడుతారో తెలియదని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలను విమర్శించే స్థాయి నీకు లేదు, అమర్ నోరు అదుపులో పెట్టుకో అని మందలించారు. నీ పంథా మార్చుకోకపోతే రాజకీయంగా కనుమరుగవుతావని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గొంపా సత్యనారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీ తెలుగులో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర- విశాఖపట్నం: జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా జీ వినియోగదారులకు సరికొత్త కార్యక్రమాలను సిద్ధమైందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 6 గంటలకు విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతి సంబరాలకు వస్తున్నాం సినిమాను, 12వ తేదీ సాయంత్రం 5. 30 గంటలకు పాన్ ఇండియా బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాను, 13 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమాలను ప్రసారం చేయనున్నామన్నారు. కాకినాడ వేదికగా జరిగిన 'సంక్రాంతి సంబరాలకి వస్తున్నాం' కార్యక్రమంలో జీ తెలుగు తారలతో పాటు ' విక్టరీ వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి పాల్గొని అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన మోస్ట్ అవైటెడ్ గ్లోబల్ బ్లాక్ బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాని జీ తెలుగు అందిస్తోందన్నారు. ఈ సినిమా చూసే ప్రేక్షకులకు జీ తెలుగు వాచ్ అండ్ విన్ కాంటెస్ట్ని నిర్వహిస్తోందన్నారు. జీ తెలుగు. మీరు చేయాల్సిందల్లా కల్కి సినిమా చూస్తూ టీవీ స్క్రీన్పై వచ్చే క్యూఆర్ కోడ్ని స్కాన్ చేయడం లేదా www.kalkionzeetelugu.zee5.com లో లాగిన్ అయి కల్కి గేమ్ ఆడి అదిరిపోయే బహుమతులు గెలవచ్చన్నారు. సంక్రాంతి సంబరాలకి కొనసాగింపుగా సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమం లో యాంకర్ రవి, వర్షిణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు, జీ తెలుగు తారలు అత్తలు, కోడళ్ల పేరున రెండు టీమ్లుగా ఏర్పడి వినోదం పంచేందుకు పోటీపడ్డారన్నారు. సాగిన ఈ కార్యక్రమాలను జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూడాలన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో శ్రీ ఉషా విద్యానికేతన్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య సంక్రాంతి ఉట్టిపడేలా పలు కార్యక్రమాలు కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చందక పాండురంగ, హెచ్ఎం శ్రీను, ఉపాధ్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న పిల్లలు తల్లిదండ్రులు

సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆనందపురం బీపీ కల్లాలు రోడ్డులో ది హైస్కూల్ ప్లే స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్కూలు ప్రాంగణంలో ఆనందోత్సవాల మధ్య పిల్లలు, తల్లిదండ్రులు ఆడి పాడారు. సంక్రాంతి సంబరాలలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి గంగరాజు పాల్గొని మాట్లాడుతూ సంక్రాంతి లాంటి పండుగలు పూర్వీకులు నుంచి వారసత్వంగా లభించాయని తర్వాత తరాలకు కూడా వీటి గూర్చి ఎంతో గొప్పగా చెప్పుకోవాలని తెలిపారు. హరిదాసుల వేషధారణ ముత్తైదువల వేషధారణ గాలిపటాల ఎగురవేయటం భోగిమంటలు చక్కగా ప్రదర్శించారు. సంక్రాంతి ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు చక్కని నృత్య నాటిక ప్రదర్శించారు.

పిల్లలు తల్లులు ముగ్గుల పోటీల పాల్గొని సంక్రాంతి యొక్క ప్రాముఖ్యతను తెలిపారు వారికి బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ దాలిగురువులు, ప్రముఖ వైద్యులు చందక త్రినాథ్ నాయుడు,ప్రముఖ జర్నలిస్ట్ డబ్బీరు విజయ్ కుమార్, స్కూల్ కమిటీ బద్దపు బంగార్రాజు, పాఠశాల డైరెక్టర్ కాకర సురేష్ కుమార్, ప్రిన్సిపల్ కుప్పల లహరి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నష్టాల కారణంగానే టీజీబీసీఎల్‌కు యుబిఎల్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర -విశాఖపట్నం: తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్)కి తమ సరఫరాలను నిలిపివేయడం గురించి నిన్న విడుదల చేసిన ప్రకటన గురించి యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ ప్రతినిధులు గురువారం మరింత స్పష్టతనిచ్చారు. రాష్ట్రంలో స్థిరంగా పెరుగుతున్న తమ నిర్వహణ నష్టాల కారణంగా మా ప్రస్తుత ప్రాథమిక ధరలు టీజీబీసీఎల్ కి 2019 లో మేము సమర్పించిన ఖర్చుల పై ఆధారపడి ఉన్నాయన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఈ ప్రాథమిక ధరలలో తదుపరి సవరణలు లేవని, గత 5 సంవత్సరాలుగా మేము నిత్యావసరాలు మరియు కార్యకలాపాల ఖర్చులో అధిక వార్షిక ద్రవ్యోల్బణాన్ని చూశాము ఫలితంగా మేము గత చాలా నెలలుగా నష్టాలతోనే టీజీబీసీఎల్‌కి సరఫరా చేస్తున్నామన్నారు. గత సంవత్సర కాలంగా మేము టీజీబీసీఎల్‌తో అనేక సమావేశాలలో ధర సవరణల ఆలస్యం గురించిన సమస్యను తెలియజేసాము ప్రభుత్వానికి అధికారికంగా ఈ సమస్య గురించి యు బీఎల్ నుంచి అభ్యర్థనలను కూడా అందించామని చెప్పారు. ప్రస్తుత ప్రాథమిక ధరల స్థాయిల క్రింద మా కార్యకలాపాల నిర్వహణ లో లాభదాయకత లేకపోవడం తో పాటుగా ధరల సవరణ యొక్క తక్షణ అవసరాన్ని సైతం వెల్లడించామన్నారు. జూలై-ఆగస్టు 2024లో, బీర్ పరిశ్రమతో పాటు, మేము కూడా ధరల స్థిరీకరణ కమిటీకి వివరణాత్మకంగా ధరల స్థిరీకరణ ఆవశ్యకత గురించి వివరణాత్మక ప్రదర్శన చేసామన్నారు . రాష్ట్రంలో మా కార్యకలాపాల స్థిరత్వాన్ని నిర్ధారించడానికి టీజీబీసీఎల్ నుండి మేము అభ్యర్థిస్తున్న ధరల సవరణ చాలా అవసరం అన్నారు. బీరును సరసమైనదిగా ఉంచాలనే టీజీబీసీఎల్ లక్ష్యంకు అనుగుణంగా మేము కార్యకలాపాలను సమలేఖనం చేసామని, బీర్ బ్రాండ్‌ల వినియోగదారుల ధరలో దాదాపు 70 శాతం సుంకాలు, వాట్ మరియు ఇతర లెవీలతో సహా తెలంగాణ రాష్ట్ర పన్నులు ఉన్నాయని మేము ఈ సందర్భంగా వెల్లడి చేయాలనుకుంటున్నామని చెప్పారు. సమస్యలను పరిష్కరించడానికి సత్వర అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశాభావం ఈ సందర్భంగా వ్యక్తిపరిచారు.

పీఎం పర్యటించిన ప్రాంతాలలో పారిశుద్ధ్య పనుల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగరంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ రోడ్ షోలో పర్యటించిన, ప్రసంగించిన కార్యక్రమ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రపరచాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జోన్ 3 లో సిరిపురం జంక్షన్ నుండి వేంకటాద్రి వంటిల్లు మీదుగా ఏయూ ఇంజినీరింగు మైదానం వరకు భారత ప్రధాని నరేంద్ర మోడీ రోడ్డు షోలో పర్యటించిన ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ముందుగా సిరిపురం జంక్షన్ సమీపంలో వేంకటాద్రి వంటిల్లు ప్రాంతాల్లో జరుగుచున్న పారిశుద్ధ్య పనులను పరిశీలిం చారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ బుధవారం భారత ప్రధాని సిరిపురం జంక్షన్ నుండి ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్

కాలేజ్ మైదానం వరకు రోడ్ షోలో పర్యటించిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను వెంటనే చేపట్టి ఆయా ప్రాంతాలను పరిశుభ్రపరచే చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్‌కు ఆదేశించారు. రోడ్ షోలో రోడ్డుకు ఇరువైపులా, మధ్యలో ఏర్పాటు చేసిన బార్కేడ్లను, అదనంగా ఏర్పాటు చేసిన వీధిలైట్లను వెంటనే తొలగించి ఆ యా ప్రాంతాలను పరిశుభ్రపరిచే చర్యలు చేపట్టాలని ప్రధాన ఇంజనీర్ పి.శివ ప్రసాద రాజుకు, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌కు కమిషనర్ ఆదేశిం చారు. రోడ్డు షో కొరకు రోడ్డుపై గుంతలు కలగకుండా, రోడ్లు మరమ్మతుకు గురికాకుండా సులభంగా అతికించి తొలగించుకునేలా బారికేడ్లను వినూత్నంగా ఏర్పాటు చేసినందుకు ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ అభినం దించారు. ప్రధానమంత్రి పర్యటించిన కార్యక్రమ ప్రాంతాల్లో గురువారం నాటికి అన్ని పనులను పూర్తి చేసి, పారిశుద్ధ్య పనులను చేపట్టి ఆయా ప్రాంతాలను పరిశుభ్రపరిచేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీరు పి.వి.సత్యనారాయణ రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్, సహాయ వైద్యాధికారి బి.ప్రసాద రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సిహెచ్.మధుసూదనరావు, శానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవిందరావు, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.